పిల్లికథ

కొడవటిగంటి కుటుంబరావు

"మ్యా! మ్యా!"

"అమ్మోయ్, పిల్లికూనేవ్!" అన్నది చిట్టి.

"తెల్లగా ఎంత ముద్దొస్తోందో!" అన్నాడు బుల్లాడు.

"ఛీ, ఛీ! దాన్ని ముట్టుకుంటా రేమ్రా. పిల్లిని ముట్టుకుంటే పంచ మహా పాతకాలూ చుట్టుకుంటై," అన్నాడు నాన్న.

"మ్యా, మ్యా!" అన్నది కూన.

"చూడు నాన్నా, ఎట్లా దగ్గిర కొస్తుందో," అన్నాడు బుల్లాడు.

"ఇది పెంపుడు పిల్లి. అందుకే పారి పోవటంలేదు." అన్నది చిట్టి.

"చూడు నా చెయ్యి ఎట్లా నాకు తుందో," అన్నాడు బుల్లాడు.

"దాని కాకలవుతోంది," అన్నది చిట్టి.

"చెబుతే మీ క్కాదుట్రా? దాన్ని వెళ్ళగొట్టండి ముందు ... బొచ్చంతా రాలిపోయి ఎంత అసహ్యంగా ఉందో, దాన్ని ముట్టుకున్నారంటే మీక్కూడా చీడ పట్టుకుంటుంది," అన్నాడు నాన్న.

"దాని కాకలవుతుంది, నాన్న. కొంచెం అన్నంపెట్టి వెళ్ళగొడదాం" అన్నది చిట్టి.

"దానికి చీడలేదు, నాన్నా." అన్నాడు బుల్లాడు. మజ్జిగా, అన్నమూ కలిపి పెడితే కూన ఉత్సాహంగా తిన్నది.

అనుకున్న ప్రకారం కూన ఇల్లు వదిలి పోలేదు. అది ఇల్లు తన సొంతం చేసుకున్నది. అందరితోపాటు ప్రతి పూటా తిండి కొచ్చేది. మిగతా సమ యాల్లో ఎండపొడో, వెచ్చని చోటో చూసుకొని నిద్రపోయ్యేది. రాత్రి పూట ఎవరో ఒకరి ప్రక్కలో పడుకునేది దాని యిష్టం వచ్చినప్పుడు బయటికి వెళ్ళి పెత్తనాలు చేసి వచ్చేది.

నాన్నకు పిల్లిని చూస్తే చాలా కోపంగా ఉండేది. "ఏమిటీ వెధవ పిల్లి? పొద్దునే మనకు దీని దర్శనం! అస్త మానమూ ఏ పనిచేసుకోబోయినా అడ్డం వస్తూంటుంది...పిల్లలూ, మీరు దీన్ని మచ్చికచేస్తే ఊరుకోను. రెండుపూటలు తిండి వెయ్యకుండా ఉంటే అదే పోతుంది," అన్నాడు నాన్న.

"ఏం, నాన్నా. పాపం ...!" అన్నట్టి చిట్టి.

"పిల్లి పాపిష్టిది. ఇంకా కుక్కనయం. విశ్వాసంగల జంతువు. దానికి స్వామి భక్తి ఉంది. పిల్లికి విశ్వాసం లేదు. తన సుఖమే చూసుకుంటుంది. ఇంకొకరి సుఖం ఓర్చలేదు. మనం ఏదన్నా తింటుంటే శాపనార్థాలు పెడుతుంది పిల్లి శాపనార్థాలంటే అవే. మనం తినే ముద్దలు కూడా లెక్క పెడుతుంది," అన్నాడు నాన్న.

"పిల్లికి ఒంట్లు వచ్చా, నాన్నా!" అన్నాడు బుల్లాడు.

"దాని ఒంట్లు దానికొచ్చులే," అన్నాడు నాన్న చిరాకుగా.

"పిల్లికి కూడా కృతజ్ఞత ఉంటుంది, నాన్నా. అది నాతోనూ బుల్లాడితోనూ ఆడుకుంటుందిగాని వేరొకరితో ఆడుకోదేం!" అన్నది చిట్టి.

"ఏమైనా దానికి అన్నంపెడితే నేను ఒప్పుకోను. మనుషులకే తినటానికి లేకుండా ఉంది!" అన్నాడు నాన్న.

"దాని తిండెంత, నాన్నా? మనం పారేసినంత ఉండదూ." అన్నాడు బుల్లాడు.

"వీల్లేదు," అన్నాడు నాన్న.

* * *

"చూడండి ఈ దిక్కుమాలిన పిల్లి ప్రద్దాన్లోనూ మూతి పెడుతున్నది! ఎట్లా చచ్చేది దీంతో!" అన్నది అమ్మ.

"గోతాంలోపెట్టి ఊరిబయట విడి చొస్తేగాని దీని పీడ వదలదు."

"దాన్ని అన్నంపెట్టక చంపుతుంటే ఏంచేస్తుందే?" అన్నాడు బుల్లాడు.

"దా న్నెవరు మేపుతారు? దాని తిండి అది చూసుకోమను," అన్నాడు నాన్న.

"దాని తిండి ఏం చూసుకొంటుంది. ఇప్పుడింటో ఎలికెలు కూడా లేకుండా పోయినై," అన్నాడు బుల్లాడు.

"అవును, పాపం. దాని ధర్మమా అంటూ ఈ పిల్లొచ్చాక ఎలికెల బాధ లేదు," అన్నది అమ్మ.

"అది ఎలికెల్ని పట్టినా మనం దాని కన్నం పెట్టం" అన్నది చిట్టి.

"మనమే కృతజ్ఞత లేనివాళ్ళం" అన్నాడు బుల్లాడు.

"ఇంకేం! ఎలికెల్ని పట్టుకోమను? మళ్ళీ అన్నంకూడా దేనికీ!" అన్నాడు నాన్న.

"ఎలికెలు అయిపోయినకొద్దీ మనకు లాభం. దానికి నష్టం. ఇదేం న్యాయం నాన్నా!" అన్నాడు బుల్లాడు.

"పట్టుకునేందుకు ఎలికెలు లేకపోతే ఇంకా ఈ పీనిగె మన కొంపలో దేవికి," అన్నాడు నాన్న.

"అది ఇంట్లో ఉండగూడదట్రా వెధవ

చీడపిల్లి దాన్ని ముట్టుకుంటేనే. రోగాలొస్తాయి" అన్నాడు నాన్న.

"చీడపిల్లా నాన్నా ? చూడు దాని వొంటినిండా ఊడ బంతల్లే ఎంతబొచ్చో బలిసి ఎంత ముద్దొస్తున్నదో !" అంది చిట్టి.

"మనింటో బాగా పాలూ, మజ్జిగా తిని కొవ్వింది. లావుగా ఉండదూ ?" అన్నాడు నాన్న.

"చిక్కితే చిక్కిందంటావు బలిస్తే బలిసిందంటావు, యెట్లా నాన్నా ?" అన్నాడు బుల్లాడు

"మనం మనుష్యులం కదా, పిల్లుల్ని దగ్గిర పడుకోబెట్టుకోవటమూ దాన్ని ఎత్తుకుని ఆడుకోవటమూ అసహ్యం కాదుట్రా ?" అన్నాడు నాన్న.

"అది మన కన్న శుభ్రంగా ఉంటుంది.

"రోజుకు పదిసార్లు ఒళ్ళంతా నాక్కుంటుంది. పక్కమీద ఉచ్చకూడా పొయ్యదు" అన్నది చిట్టి.

నాన్న మాట్లాడలేదు. కాని, మర్నాటినించీ పిల్లికూడా కనపళ్ళేదు. నాన్న ఏం చేశాడో మరి.

* * *

క్రిస్మస్ శెలవులకి బావొచ్చాడు.

చిట్టీ, బుల్లాడూ బావ చెరో చెయ్యీ పట్టుకు వేళ్ళాడుతూ పిల్లి కథంతా చెప్పారు.

"పిల్లిని వెళ్ళగొట్టటం అన్యాయమే" అన్నాడు బావ. "మచ్చికచెయ్యని పిల్లి దాని యిష్టం వచ్చినట్లు అది జీవిస్తుంది. తిండి దొంగిలిస్తుంది. కొట్టబోతే పారిపోవటం నేర్చుకుంటుంది దాని బతుకు అది చూసుకుంటుంది. కాని మనం దాన్ని మచ్చిక చేసిన తరువాత దాని బతుకు అది చూసుకోలేదు. ఎలికెలబాధ కోసం పిల్లిని పెంచి ఎలికెలబాధ పోగానే దాన్ని వెళ్ళగొట్టేస్తే దాని గతి ఏం కానూ ? కొన్నాళ్ళు మనుషులు దానికి తిండి పెట్టటంచేత మనిషి తనకు శత్రువనేజ్ఞానం దానికి లేకుండాపోతుంది. దొంగతనంగా తిండి సంపాదించటం దానికి అలవాటుండదు. మనిషిని నమ్ముతూ అది తిండిలేక చస్తుంది. ఆ పాపం పెంచిన వాళ్ళని చుట్టుకుంటుంది" అన్నాడు బావ.

"ఇప్పుడు మళ్ళీ మనింటో ఎక్కడ చూసినా ఎలికెలే" అన్నది చిట్టి.

"ఎందుకుండవూ ? పిల్లి ఉన్నంత కాలమూ దాని ఉపయోగం ఏమీ లేనట్టే ఉంటుంది. అది పోయిన తరువాతగాని దాని ప్రయోజనం తెలియదు" అన్నాడు బావ.

"పిల్లులు మంచివికావంటాడే నాన్న? వాటిని ముట్టుకుంటే పంచమహాపాతకాలు చుట్టుకుంటాయట. వాటిని ముట్టుకుంటే రోగంకూడ వస్తుందట." అన్నాడు బుల్లాడు.

"దాని బతుకు దాన్ని బతకనివ్వక మనం దాన్ని సరిగా చూడనప్పుడు పిల్లి అనారోగ్యంగా ఉండదూ ? వొంటినిండా చీడపడుతుంది. బొచ్చంతా రాలిపోతుంది. మనం చూడకుండా అది మనం తినేవాటిని ముట్టుకోవచ్చు. మన పక్కల్లో పడుకోవచ్చు. మన గిన్నెల్లో మూతి పెట్టవచ్చు. అట్లా కూడా మనకు రోగాలొస్తాయి ... అంతేగాని మనం శ్రద్ధగా పెంచే పిల్లి ఎంత ఆరోగ్యంగా నైనా ఉంటుంది. దానివల్ల మనకూ, మనవల్ల దానికీ, లాభం వుంటుంది" అన్నాడు బావ.

బావ ఈ మాట అంటుండగానే బుల్లాడు దూరంగా ఒక పిల్లిని చూశాడు. బయట గడ్డిలో ఏదో వెతుకుతున్నది పిల్లి.

"అది మన పిల్లే, బావా !" అన్నది చిట్టి.

బావా, చిట్టీ, బుల్లోడు కలసి పిల్లిని చూడటానికి బయటికొచ్చారు. వాళ్ళు దగ్గరకి రావడం చూచి పిల్లి నాలుగు గజాలు పారిపోయి వాళ్ళకేసి భయంతో చూస్తూ నిలబడింది.

"చూశావా చిట్టీ. మన పిల్లి ఎట్లా అయిపోయిందో. దాని వొంటిమీద బొచ్చంతా రాలిపోయి, చిక్కిపోయి ఎట్లా ఉందో ?" అన్నాడు బుల్లోడు.

"ఛీ, పాడు పిల్లి మన కొద్దు !" అన్నది చిట్టి.

"మనింటో ఎలికెలో ?" అన్నాడు బావ.

"ఎలికలయితే మటుకు దీ న్నెట్లా పెంచుతాం, బావా !" అన్నది చిట్టి.

"అట్లా కాదే, చిట్టీ. దీనికి నాలుగు రోజులు తిండిపెడితే మళ్ళీ బాగా బలుస్తుంది వొంటినిండా బొచ్చొస్తుంది. ఎలికెల్ని కూడా పడుతుంది !" అన్నాడు బావ.

"నేను పట్టుకోనా !" అంటూ బుల్లాడు పిల్లిదగ్గిరి కెళ్ళాడు. పిల్లి భయపడుతూ ముడుచుకుపోయి, పీల గొంతుతో, "మ్యా ! " అన్నది.

"ఎంత జాలిగా అరుస్తోందో !" అన్నది చిట్టి.

* * *

పిల్లి ఇప్పుడు బాగా బలిసింది. చిట్టితోనూ బుల్లాడితోనూ చాల సరదాగా ఆడుకుంటుంది ఇంటో ఎక్కడా ఎలికె అలికిడి లేదు. అది ఒక్కసారి నాన్న పక్కమీదికే వెళ్ళి దర్జాగా పడుకుంటుంది. నాన్న దానికేసి అనుమానంగా చూస్తాడు గాని, ఏమీ అనడు.